


# శిశువుకు లేఖ

డి. పద్మశ్రీ

ప్రియమైన పాపా!

నేను నీకీ లేఖ రాసే సమయానికి నువ్వు నాలో ఒక భాగంగానే ఉన్నా వమ్మా! ఇంకా పుట్టని బిడ్డకు తల్లి ఉత్తరం రాయవలసిన పరిస్థితి ి తల్లికి ఎదురైంది. నువ్వు ప్రాణం పోసుకొని ఈ లోకంలోకి రాగానే నేను ఈ ప్రపంచం నుంచి నిష్క్రమించాలని నేను తీసుకున్న నిర్ణయం నా చేత ఈ లేఖ రాయిస్తోంది.

"ప్రియమైనా నా శిశువా! నువ్వు పాపవో, బాబువో నాకు తెలియదు. కానీ నువ్వు నాలో ప్రాణం పోసుకొన్నప్పటి నుంచి ఈ ఇంట్లో హఠాత్తుగా నాకు అస్తిత్వం ఏర్పడింది. నా ఉనికికి గుర్తింపు లభించింది. మొన్నటి వరకూ ఈ ఇంట్లో ఒక జీతం లేని పని మనిషిలా, ఒక వాషింగ్ మెషిన్‌లా, ఒక వంట మనిషిలా ఉన్న నా స్టేటస్ అమాంతం ఇలా పెరిగి పోవడానికి కారణం వాళ్ల వంశాకురం అనే నీవు నాలో ప్రాణం పోసుకోవడమే. అయితే నీ మూలంగా నాకు లభించే ఈ కృత్రిమమైన ఆదరణ, అభిమానం, ఆప్యాయత నాకు అసహ్యం కలిగిస్తున్నాయి. ఇరవై ఏళ్ళు మా అమ్మా నాన్నల ముద్దు బిడ్డగా పెరిగి, విద్యావతిగా నా కంటూ ఒక వ్యక్తిత్వం సంతరించుకున్న నాకు లభించని గౌరవం, నిన్న గాక మొన్న ప్రాణం పోసుకొన్న ఇంకా ఒక రూపమైనా ఏర్పడని నీకు లభించడం నేను సహించలేక పోతున్నాను!

"ఇంతే కాదు, ఈ తొమ్మిది నెలలూ నీ కోసం వాళ్ళు నా పట్ల చూపే ఆదరణకు వాళ్ళు ఆశించే ప్రతిఫలం ఏమిటో తెలుసా? నేను మగ బిడ్డనే కనాలి. అంటే నీవు మగ శిశువువే కావాలి. ఒకవేళ ఆడ శిశువు వయితే, అందుకు అంటే నేను ఆడపిల్లను కన్నందుకు పరిహారంగా మా అమ్మా నాన్నలు మరో యాభై వేలు కట్నం బకాయి కింద సమర్పించుకోవాలి. లేకపోతే అగ్గిపెట్టె, కిరోసిన్ ఉండనే ఉన్నాయి. అయితే ఆ భగవంతుడు ఆడదానికి ప్రాణం పోసి బిడ్డను కనే శక్తే ఇచ్చాడు కానీ ఆ బిడ్డను ఇష్టం వచ్చినట్లు ఆడగానో, మగగానో మార్చుకొనే శక్తి ఇవ్వలేదు. అందువలన ను వ్వెవరో నాకు తెలీదు.

"అదృష్టం బావుండి నువ్వు బాబువే అయితే ఈ పురుషాధిక్య సమాజంలో నీ భవిష్యత్తు బంగారు బాటలో సాగిపోతుంది. వంశోద్ధారకు

ణ్ణిచ్చినందుకు నాకూ ఓపిసరంత గౌరవం దక్కుతుంది. అప్పుడు నీకు ఈ తల్లి మాటల అవసరం అంతా ఉండదు.

"సమస్యల్లా నీవు ఆడపిల్లవైతేనే! నేను రాస్తున్న ఈ ఉత్తరం నీ కోసమే! బంగారు పాపా! నువ్వు పుట్టిన మరుక్షణమే మనుషుల రూపంలో ఉన్న యమ భటులు పురిట్లోనే నీ ప్రాణాన్ని అనంతవాయువుల్లో కలిపేస్తారు. ఒకవేళ ఎట్టి పరిస్థితులలోనైనా దయ, జాలి ఒక్క క్షణం వారి హృదయాలను తాకితే నువ్వు బ్రతికి బట్టకట్టవచ్చు. అప్పుడు ఈ కుటుంబంలో మగబిడ్డను కనలేని అసమర్థత మూలంగా నేను, ఆడపిల్లగా పుట్టినందుకు నీవూ ఇద్దరమూ పనులు చేసే యంత్రాలుగా మిగులుతాం. నన్ను కని పీక పిసికెయ్యకుండా పెంచినందుకు నా తలిదండ్రులు వారి జీవితాంతం కట్నమనే నష్టపరిహారం వాయిదాలుగా చెల్లిస్తూనే ఉండాలి.

"ఈ పర్యవసానాలన్నీ నా ఈ చిన్న మనసు తట్టుకోలేదేమోనని భయమేస్తోందమ్మా! ఒకే తల్లికి పుట్టిన ఇద్దరు శిశువుల పట్ల కేవలం లింగభేదం కారణంగా ఈ సమాజం చూపే వివక్ష చూస్తూ ఈ తల్లి హృదయం భరించలేదేమోనని తల్లడిల్లుతున్నాను. సమాజానికి మీరు ఆడ, మగగా కన్పించినా నాకు మాత్రం నా పేగు తెంచుకొని పుట్టిన బిడ్డలేగా. ఈ అసమానతలు ఎలా సహించగలను? నా చిన్నారి పాపను తనివితీరా హృదయానికి హత్తుకోవాలని, ముద్దాడాలని, చందమామను చూపించి గోరు ముద్దలు తినిపించాలని, పాటలు నేర్పించి చదువుల సరస్వతిగా, సాహసంలో ఝాన్సీరాణిలా, రుద్రమదేవిలా తీర్చిదిద్దాలని నాకూ ఉంది. కానీ ఏం చేయను?

"సైన్స్ యుగంగా పేరు పొందుతున్న ఈ 20వ శతాబ్దంలోనే ఒక వైపు స్త్రీ దేశాన్నేలుతోంటే, మరో వైపు ఆ స్త్రీయే వరకట్నపు దురాచారానికి సమిధ అవుతోంది. ఒక చోట 'సతి'గా భస్మమవుతోంది. మరో చోట ఆడ శిశువుగా పుడుతూనే హత్యకు గురి అవుతూంది. స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం' అని చెప్పుకొనే మన పవిత్ర భారతదేశంలో స్త్రీ బ్రతుకు ఆడదిగా పుట్టేకంటే అడవిలో మానై పుట్టడం నయం అనుకొనేలా వెతల పాలౌతోంది. ఒక స్త్రీ రక్షణ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తోంటే మరో స్త్రీ పట్టపగలు రాజధాని నగరపు నడి బొడ్డునే మానభంగానికి గురౌతోంది. ప్రేమించి తగలేసే వాడొకడైతే, పెళ్ళి చేసుకొని తగలేసే వాడు మరొకడు. అమ్మా నాన్నలు, అన్నదమ్ములు, అత్తమామలు ఇందరు మనుషుల మధ్య మసలే వారికే రక్షణ లేని ఈ సమాజంలో ఇక అనాథగా పెరగబోయే నీ రక్షణ గురించి నే నేమి గ్యారంటీ ఇవ్వగలను? అయినా నే నీ నిర్ణయం తీసుకొంటున్నానంటే కారణం నిన్ను మాలాంటి ఓ ప్రాణమున్న బొమ్మలాగా చూసుకోడం ఇష్టం లేక.

"నువ్వు పుట్టగానే నా ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోతాయి. నిన్ను ఇక్కడి నుంచి దూరంగా తీసుకు వెళ్ళి ఒక అనాథాశ్రమంలో చేర్పించ వలసిందిగా నా ప్రాణ స్నేహితురాలిని కోరాను. ఆమె తప్పకుండా నా కిచ్చిన మాట నిలబెట్టుకుంటుంది. నా వరాల పాపా! నీవు అనాథగా పెరగలవలసి వచ్చినందుకు బాధపడకు. దిక్కులేని వారికి దేవుడే దిక్కంటారు. అమ్మా నాన్న లాంటి మామూలు మనుషుల నీడలో బ్రతికే కంటే సర్వశక్తిమంతుడైన ఆ దేవుని నీడలో బ్రతకడం గొప్ప కదా! అందుకు గర్వించు. ఆడపిల్లగా పుట్టినందుకు నువ్వు నీ తల్లి లాగే కాకుండా ఒక ఆడపిల్లగా కాక, ఒక వ్యక్తిగా ఎదిగే అవకాశాన్ని కల్పించాలని నా పరిధిలో ఈ ప్రయత్నం చేస్తున్నాను. నీవు పెద్దదానివయ్యే సరికన్నా ఈ సమాజం మారి, స్త్రీకి కూడా మనిషిగా విలువ నిస్తుందేమోనని ఆశిస్తున్నాను. అయినా శతాబ్దాలుగా మారని ఈ సంకుచిత సమాజం, పాతికేళ్ళలో మారుతుందనుకోవడం నా పిచ్చి కాదూ! ఆశ జీవితానికి చుక్కాని అని నేను నేర్చుకొన్న పాఠమే నా బ్రతుక్కి ఇప్పటి వరకూ ఊపిరిలాగా ఉంది. ఇంకా నా వల్ల కాదు.

"అందుకే నేను కాకపోయినా కనీసం నా బిడ్డయినా ఈ లోకానికి ఆదర్శం కావాలని నీ తల్లి తపన. బంగారు తల్లీ! ఫలానా వారి బిడ్డగా నా బిడ్డ గుర్తింపు పొందడం నా కిష్టం లేదు. నీకు నీవుగానే గుర్తింపు సంపాదించుకోవాలి. ఇట్స్ బెటర్ టు నోబ్లీ రిమెంబర్డ్ దేన్ నోబ్లీ బోర్న్. సో ఇట్ ఈజ్ లెఫ్ట్ టు యు. నీ జీవితాన్ని నీ ఇష్టం వచ్చినట్లు జీవించే అవకాశం నీకు లభించింది. దాన్ని ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దుకో గలగుతావని ఆశిస్తూ.....

"మీ అమ్మ"

★

## తోటలో పాట

ఇన్ని కోట్ల పక్షులతో
ఈ తోట క్రిక్కిరిసింది
పాట కరువై పాడువడ్డ గొంతుకతో
కొన్ని పక్షులు జాలిగా, దీనంగా...
ఒక దృశ్యం హృదయాన్ని కలచివేస్తుంది.
కుట్టి బాధపెట్టే కుతూహలంతోనూ
గొంతులో పాటకు ప్రతిబంధకమయ్యే
గాలంతోనూ
దిగులుగా, దయనీయంగా పక్షులు...
ఈ తోటలో చీకటి అంటుకుని
చెట్లూ, పిట్టలూ, పాటలూ వికృతమై...
ఒక చిత్రం మనసును చిత్రవధ చేస్తుంది

★ ★

ఇక్కడ కోయిలలు 'దీర్ఘాలు' తీసి
పావురాలు 'గుడి'మీద మనసు నిలిపి
నెమళ్ళకు 'తలకట్టు' సొంపు సొంతమై
కొండ 'కొమ్ములు' గుచ్చుకుని
ఆకాశం వెల్తుర్ని స్రవించినట్టు
ప్రతి పక్షీ అందమైన పాటను
ప్రసవించాలని
ఒక ఆశ గిలిగింతయై
హృదయాన్ని సుతారంగా స్పృశిస్తుంది

★ ★

ఇక్కడ పాట వర్షించి,
పాట ప్రవహించి
పాటల పుష్పాలు వికసించి
పాట పరిమళంతో తోట గుబాళించి తోట
రెక్కల మీద
చిక్కని పాట పరచుకోవాలని
గొంతులో బందీ అయి
గాలం గిల గిల లాడాలని
ఒక అందమైన కల
కనురెప్పల మాటున
మెత్తగా తగుల్తుంది!

డా. ఎన్. సురేంద్ర

ఫొటో: కొల్లూరి వెంకట్ [తెనాలి]

